ప్రజాశక్తి
శుక్రవారం 31 మే, 2024
5
శ్రీకాకుళం



1న జెడ్‌పి స్థాయి, సర్వసభ్య సమావేశం



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాపరిషత్ స్థాయీ సంఘాల, సాధారణ సర్వసభ్య సమావేశం జూన్ ఒకటో తేదీన జెడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జెడ్‌పి సిఇఒ కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం పది గంటలకు స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశాలకు సభ్యులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

- మరో నాలుగు రోజుల్లో ఎన్నికల ఫలితాలు వెల్లడి
- రోజురోజుకూ పెరుగుతున్న ఉత్కంఠ
- బూత్‌ల వారీ లెక్కలు, అంచనాల్లో అభ్యర్థులు

ప్రజాశక్తి - టెక్కలి

జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ స్థానాలకు సంబంధించి వైసిపి, టిడిపి మధ్య హోరాహోరీ పోరు సాగింది. చాలా చోట్ల ఈ రెండు పార్టీలతో పాటు ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ కూడా బలమైన పోటీ ఇవ్వడంతో త్రిముఖ పోరు సాగింది. ఎన్నికల ముందు వరకు కాంగ్రెస్ ప్రభావం పెద్దగా ఉండదని వైసిపి, టిడిపి నాయకులు భావించారు. పోలింగ్ దగ్గరపడేసరికి, పోలింగ్ తర్వాత ఆ అభిప్రాయాన్ని కొంత మార్చుకున్నట్లు కనిపిస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు అనుకున్న దానికి మించి ఓట్లు వస్తాయన్న అంచనాలు నెలకొన్నాయి. దీంతో వైసిపి, టిడిపి అభ్యర్థుల్లో గుబులు నెలకొంది. కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్ మొదలు కావడంతో అన్ని వర్గాల్లోనూ ఫలితాలపై ఆసక్తి నెలకొంది. ఓట్ల లెక్కింపునకు మరో నాలుగు రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఇప్పటికే జిల్లాలో పలు అసెంబ్లీ స్థానాల్లో వైసిపి, టిడిపి గెలుపోటములపై పందాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నాలుగు రోజుల వ్యవధిలో పందాల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. శ్రీకాకుళం ఎంపీ స్థానానికి సంబంధించి క్రాస్ ఓటింగ్ జరిగినట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావం ఎవరిపై పడుతుందోనన్న భయం అభ్యర్థులను వెంటాడుతోంది.

అభ్యర్థుల్లో టెన్షన్.. టెన్షన్

కౌంటింగ్ రోజు దగ్గర పడుతుండడంతో అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. బూత్‌లు, గ్రామాల వారీ పోలైన ఓట్లలో తమకు ఎన్ని వచ్చి ఉంటాయనే దానిపై ఒకటికి పదిసార్లు అంచనాలు వేసుకుంటున్నారు. తమ పార్టీకి చెందిన ముఖ్య నేతలు, సీనియర్ కార్యకర్తలతో పదేపదే విశ్లేషణలు రూపొందించుకుంటున్నారు. కౌంటింగ్ వరకు ఈ విశ్లేషణలు, అంచనాలు కొనసాగుతూనే ఉంటాయి. గెలుపు ఎవరిని వరిస్తుందోనన్న ఉత్కంఠకు జూన్ నాలుగో తేదీన తెర పడనుంది.



ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలి

ఘనంగా సిఐటియు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - రణస్థలం, ఎచ్చెర్ల

కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలకు సన్నద్ధం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. సిఐటియు 54వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రణస్థలం మండలం బంటుపల్లి వద్ద గల యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమ వద్ద అమ్మన్నాయుడు, ఎచ్చెర్ల మండలం నాగార్జున అగ్రికమ్ వద్ద తేజేశ్వరరావు సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐక్యత, పోరాటం నినాదంతో 1970 మే 30న ఆవిర్భవించిన సిఐటియు నేటికి 54 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. 1970వ దశకంలో రైల్వే కార్మికులను ఐక్యం చేసి 20 రోజుల సమ్మెతో కేంద్ర ప్రభుత్వాన్ని గడగడలాడించిన దశ నుంచి నేడు కార్మిక సంఘాలన్నింటినీ ఐక్యం చేసి ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలకు వ్యతిరేక పోరాటంలో అగ్రభాగాన నిలుస్తుందన్నారు. సిఐటియు ఏర్పడినప్పట్నుంచి కార్మిక, ప్రజా వ్యతిరేక ప్రభుత్వ విధానాలపై రాజీ లేని పోరాటం చేసిందని గుర్తుచేశారు. పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా విశాల కార్మికవర్గ ఐక్యత కోసం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక సంఘాలను ఐక్యపరిచి పోరాడడంలో సిఐటియు కీలకపాత్ర పోషిస్తోందన్నారు. కార్మిక హక్కులను కాలరాస్తూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కొనసాగుతున్న ఉద్యమం వల్ల మోడీ ప్రభుత్వం వాటిని అమలు చేయలేదని గుర్తుచేశారు. పాలకులకు ప్రజల ప్రయోజనాల కంటే అదానీ, అంబానీ వంటి కార్పొరేట్‌ల ప్రయోజనాలే ముఖ్యమని విమర్శించారు. దోపిడీ, పీడన లేని సమాజం సిఐటియు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.నారాయణరావు, జె.గంగరాజు, ఎపిబిసిఎల్ హమాలీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.బంగార్రాజు, నాగార్జున అగ్రికమ్ యూనియన్ నాయకులు వై.గోపాలుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని డైమండ్ పార్కు వద్ద కళాసీ కార్మిక సంఘం ఆధ్వర్యాన సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. సిఐటియు పతాకాన్ని జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, కళాసీ కార్మిక సంఘం కార్యదర్శి బి.చిన్నారావు, అప్పలరాజు, అప్పారావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం : జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు



శ్రీకాకుళం అర్బన్ : జెండాను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

పొరపాట్లకు తావు లేకుండా కౌంటింగ్

జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓట్ల లెక్కింపులో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, పొరపాట్లకు తావు లేకుండా కేటాయించిన విధులు సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఆర్‌ఒలు, ఎఆర్‌ఒలు, సూపర్‌వైజర్లకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సక్రమంగా చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ స్ఫూర్తితో ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వర్తించాలన్నారు. జూన్ 4న ఉదయం 6 గంటలకు ఎచ్చెర్ల మండలంలోని శివాని ఇంజినీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమంలో భాగంగా మొదట పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందని అన్నారు. అనంతరం 8 నియోజకవర్గాల కౌంటింగ్ హాళ్లలో ఇవిఎంల ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. పార్లమెంట్ నియోజకవర్గం కౌంటింగ్ హాలు వద్ద ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని తెలిపారు. ఇందుకోసం పార్లమెంట్ నియోజకవర్గానికి 30 టేబుళ్లు, పోస్టళ్లకు 3, 4 టేబుళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఒక్కో టేబుల్‌కు 500 చొప్పున పోస్టల్ బ్యాలెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి టేబుల్‌కూ పోటీ చేస్తున్న అభ్యర్థుల తరపున కౌంటింగ్ ఏజెంట్లు ఉంటారన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియను వివరిస్తూ... ఇందులో రెండు కవర్లు ఉంటాయని అన్నారు. బయటి కవర్‌ని ఫారం 13-సిగా పిలుస్తారని, దానిని తెరిచిన తర్వాత రెండు డాక్యుమెంట్లు ఉంటాయని చెప్పారు. అందులో ఒకటి డిక్లరేషన్ 13-ఎ, ఇంకొకటి 13-బి కవరులో వాస్తవ పోస్టల్ బ్యాలెట్ ఉంటుందన్నారు. డిక్లరేషన్ 13-ఎలో తప్పనిసరిగా ఓటరు సంతకం చేసి ఉండాలని అన్నారు. దానితోపాటు గెజిటెడ్ అధికారి ధ్రువీకరించి సంతకం చేసి స్టాంపు వేయడం, హోదాని రాసి ఉండాలన్నారు. అలా ఉంటేనే అది చెల్లుబాటు బ్యాలెట్ ఓటుగా పరిగణించాలన్నారు. చెల్లుబాటుకాని ఓట్లు ఏవైనా ఉంటే 13-సి కవర్లో ఉంచి తిరస్కరిస్తూ... వేరుగా పెట్టెలో ఉంచుతామని అన్నారు. ఓట్లు లెక్కింపు కేంద్రంలోకి సెల్‌ఫోన్లకు అనుమతిలేదన్నారు. లెక్కింపు ప్రక్రియలో సమస్యలు ఉత్పన్నమైతే పరిష్కారానికి సానుకూలంగా స్పందించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో పాటించాల్సిన ఆయా విషయాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. ఓట్లు లెక్కింపు కేంద్రంలోకి ఆర్‌ఒలు, ఎన్నికల పరిశీలకులు మాత్రమే సెల్‌ఫోన్లను తీసుకెళ్లవచ్చని అన్నారు. మిగిలిన అధికారులు, సిబ్బంది ఎవ్వరూ కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదని అన్నారు. అక్కడ సెల్‌ఫోన్ల కోసం ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. జెసి ఎం.నవీన్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియకు అందరు సహనంతో, సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఎన్నికల నిబంధనలు విధిగా పాటించాలన్నారు. ఎటువంటి సొంత ఆలోచనలకు తావులేదన్నారు. ఈ శిక్షణా తరగతులలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఇచ్ఛాపురం, పలాస, పాతపట్నం, శ్రీకాకుళం, ఎచ్చెర్ల, నరసన్నపేట, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు సుదర్శన్‌దొర, భరత్‌నాయక్, అప్పారావు, సిహెచ్.రంగయ్య, లక్ష్మణమూర్తి, రామ్మోహనరావు, నోడల్ అధికారులుగా జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, ఎన్.బాలాజీ, మాస్టర్ ట్రైనర్లు శేషగిరి, మెప్మా పీడీ కిరణ్ కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారులు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

కౌంటింగ్ కేంద్రమైన శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. శివానీ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లను ఆమదాలవలస రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి గురువారం పరిశీలించారు. నియోజకవర్గాల వారీగా స్ట్రాంగ్‌రూమ్‌లన్నీ క్షుణ్ణంగా పరిశీలించి సందర్శకుల పుస్తకంలో సంతకం చేశారు. అనంతరం అక్కడ్నుంచి పార్కింగ్ ప్రాంతాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. అంబులెన్స్‌లు నిలుపు స్థలం, వైద్యారోగ్యశాఖ ఏర్పాటు చేయనున్న స్టాల్స్, ఫుడ్ స్టాల్స్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, జెడ్‌పి సిఇఒ వెంకటేశ్వరరావు, ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు, డిపిఒ వెంకటేశ్వరరావు, చల్లా ఓబులేసు, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ ఆర్.వెంకట్రామన్, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

2 కి.మీ పరిధిలో రెడ్ జోన్

- సోషల్ మీడియా పోస్టులపై నిఘా
- ఎస్‌పి జి.ఆర్ రాధిక



ప్రజాశక్తి - శ్రీకాకుళం

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నేపథ్యంలో ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్, పరిసర ప్రాంతాల్లో రెండు కిలోమీటర్ల వరకు రెడ్ జోన్ (నో ఫ్లయింగ్ జోన్)గా పరిగణిస్తున్నట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలు, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి జూన్ 4వ తేదిన ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ శివానీ ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్‌రూమ్‌లో చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నిర్దేశించిన పరిసర ప్రాంతాల నుంచి చుట్టుపక్కల రెండు కిలోమీటర్ల పరిధి వరకు రెడ్ జోన్‌గా ప్రకటించినట్లు తెలిపారు. రెడ్ జోన్ ప్రాంతంలో డ్రోన్స్ గానీ, బెలూన్స్ గానీ ఎగురవేయట నిషేధించినట్లు పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

సోషల్ మీడియా పోస్టులపై నిఘా

సోషల్ మీడియాలో పోస్టులపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టెలీగ్రామ్ తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫారాల్లో ఉద్దేశపూర్వకంగా కుల, మత, రాజకీయ పార్టీలను, వ్యక్తులను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టడం, అవాస్తవాలను ఇతరులకు షేర్ చేయకుండా గ్రూప్ అడ్మిన్ ముందస్తుగా నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వదంతులు పోస్ట్ చేసిన వారిపై, గ్రూప్ అడ్మిన్‌పై ఐటి చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఎగ్జిట్‌పోల్స్, ఎన్నికల ఫలితాలపై ఎటువంటి విద్వేషాలు రెచ్చగొట్టే సందేశాలు, ఫొటోలు పోస్టు చేస్తే గ్రూప్ అడ్మిన్లు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో పోస్టు చేసే ప్రతి సున్నితమైన అంశంపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. ఇందుకోసం జిల్లా కేంద్రంలో సోషల్ మీడియా సెల్ విభాగం సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తుంటారని తెలిపారు.

శాస్త్రీయ దృక్పథం అవసరం

డిఇఒ కె.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం అవసరమని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. మణికొండ అన్నపూర్ణమ్మ 26వ వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మెమోరియల్ కమిటీ గురువారం నిర్వహించిన విద్యా ప్రోత్సాహక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన ప్రమాణాలు గల విద్యా విధానం ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉందని, ఈ సౌకర్యాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కె.కామేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సమయపాలన, క్రమశిక్షణ, శాస్త్రీయ ఆలోచనా దృక్పథాన్ని అలవరుచుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించిన ప్రతిభా పరీక్షలో విజేతలకు డిఇఒ పుస్తకాలు, ప్రసంసాపత్రాలు అందజేశారు. 14 మండలాల నుంచి ఈ పరీక్షకు 533 మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 50 మందిని ఎంపిక చేసి సత్కరించారు. అత్యధిక మార్కులు సాధించిన ఆమదాలవలసకు చెందిన టి.సృజనకు రూ.15 వేలు, ఎం.హర్షవర్ధన్‌కు రూ.14వేలు, కోటబొమ్మాళికి చెందిన ఎం.జగదీష్‌కు రూ.13 వేలు, బి.రేవతికి రూ.12వేలు, నరసన్నపేట మండలం కంబకాయ పాఠశాలకు చెందిన పి.సురేష్ కుమార్‌కు రూ.11 వేల నగదు పురస్కారాలను అందజేశారు. మెమోరియల్ కమిటీ కన్వీనర్ ఎం.ఆదినారాయణమూర్తి దంపతులు నిర్వహించిన సేవా కార్యక్రమంలో ప్రభుత్వ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.వాగ్దేవి, యుటిఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రోత్సాహకాలతో విద్యార్థులు

రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు

వంశధార ఎస్ఇ తిరుమలరావు



తిరుమలరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వంశధార ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో కుడి, ఎడమ కాలువల ద్వారా రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్టు వంశధార ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజినీర్ డోల తిరుమలరావు అన్నారు. నగరంలోని వంశధార ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌కు నీటి యాజమాన్యంపై ఇప్పటి నుంచి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. వంశధార రెండో దశ నిర్మాణ పనులు 98 శాతం పూర్తయ్యాయని తెలిపారు. రిజర్వాయర్లు అందుబాటులో ఉండడం వల్ల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉందన్నారు. నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఒడిశా అభ్యంతరం వ్యక్తం చేయడంతో గొట్టాబ్యారేజీ నుంచి ఎడమ కాలువపై ఎత్తిపోతల పథకం నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ పనులు పూర్తయితే హిరమండలం రిజర్వాయరు పూర్తిగా నీటితో నింపడం సాధ్యమవుతుందన్నారు. వర్షాకాలంలో వృథాగా సముద్రంలోకి పోతున్న జలాలను లిఫ్ట్ ద్వారా హిరమండలం రిజర్వాయరులోకి మళ్లించడానికి సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కొన్నేళ్లుగా గొట్టాబ్యారేజీ ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం ప్రమాద స్థితికి చేరుతోందని చెప్పారు. మరమ్మతులకు నిధులు మంజూరు కాకపోతే ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సక్రమంగా సాగునీరు అందించడం కష్టమవుతుందన్నారు. కుడి, ఎడమ కాలువల మరమ్మతులకు నిధుల్లేక ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. సాగునీటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవడంలో రాష్ట్రంలో వంశధార ప్రాజెక్టు ప్రథమ స్థానం, దేశంలో రెండో స్థానంలో నిలిచిందన్నారు.

'ఉపాధి' సగటు కూలి రూ.295 లక్ష్యం

డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు

ప్రజాశక్తి - జలుమూరు

ఉపాధి హామీ కూలీలు రూ.295 సగటు కూలి పొందే విధంగా అవసరమైన పనులు చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు ఆదేశించారు. జలుమూరు మండల పరిషత్ కార్యాలయంలో జలుమూరు, సారవకోట మండలాలకు చెందిన ఉపాధి హామీ సిబ్బందితో పనుల ప్రగతిపై గురువారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మండలాలకు నిర్దేశించిన లక్ష్యాల మేరకు కూలీలకు పని దినాలు కల్పించాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ రెండు పూటలా చల్లని వేళల్లో మాత్రమే పనులు చేసేలా క్షేత్రస్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కూలీలకు గరిష్ట కూలి అందే విధంగా సాంకేతిక, క్షేత్ర సహాయకులు సాంకేతికపరమైన సలహాలు ఇవ్వాలని సూచించారు. కొలతల మేరకు పనులు చేయించడం వల్ల గరిష్ట కూలి అందుతుందని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగులకు శత శాతం ఉపాధిని చూపించాలన్నారు. పంచాయతీ స్థాయిలో రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయించి, పని ప్రదేశాల్లో పూర్తి వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండలాల్లో అవసరం మేరకు పనులను గుర్తించి తక్షణమే అంచనాలు తయారు చేసి జిల్లా కార్యాలయానికి పంపించాలన్నారు. ప్లాంటేషన్ పనులకు తక్షణమే అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. రైతులకు మునగ సాగుపై అవగాహన కల్పించాలని, లక్ష్యం మేరకు మునగ ప్లాంటేషన్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. పూడికతీత పనులకు ప్రత్యామ్నాయంగా ఇతర పనులను గుర్తించి అంచనాలు తయారు చేయాలన్నారు. ఉపాధి పనుల్లో జిల్లాను మోడల్ జిల్లాగా తయారుచేసే విధంగా సిబ్బంది పరస్పరం సహకరించుకుని ప్రగతి సాధించాలన్నారు. సమావేశంలో ఎపిడి మురళీకృష్ణ, రెండు మండలాలకు చెందిన ఎపిఒలు, ఇసిలు, టిఎలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కోరం లేక మున్సిపల్ సమావేశం వాయిదా

వైసిపి కౌన్సిలర్ల గైర్హాజరు

ప్రజాశక్తి పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపల్ సాధారణ సమావేశం చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన గురువారం ఉదయం సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి వైసిపికి చెందిన కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. ఒక్క టిడిపి చెందిన కౌన్సిలర్లు హాజరు కావడంతో కోరం లేక సమావేశం వాయిదా పడింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు మాట్లాడుతూ సేవ చేసేందుకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని, సభ్యులు ప్రజాస్వామ్యాన్ని కాపాడాలన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా సమావేశంలో చర్చలు జరిపేందుకు అవకాశం లేదన్నారు. నిబంధనల మేరకు నెలకోసారి సమావేశం నిర్వహించాల్సి అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈ సమావేశాలు ఏర్పాటు చేయడం చేశామని చెప్పారు.

మారుతున్న రాజకీయ పరిణామాలు

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో సార్వత్రిక ఎన్నికల అనంతరం రాజకీయ పరిణామాలు శరవేగంగా మారుతున్నాయని చెప్పుకోవడానికి గురువారం నిర్వహించిన సమావేశాన్నే ఉదాహరణగా తీసుకోవచ్చు.

ఎన్నికల కోడ్ అమలు అయిన తరువాత గత నెల ఒక సమావేశం జరిగింది. ఆ సమావేశానికి అందరూ సభ్యులు హాజరై కోడ్ నిబంధనలు మేరకు చర్చలకు అస్కారం లేకపోవడంతో తూతూ మంత్రంగా ముగించారు. రెండో సమావేశం గురువారం నిర్వహించగా, వైసిపికి చెందిన కౌన్సిల్ సభ్యులు మూకుమ్మడిగా గైర్హాజరు కావడం, టిడిపి సభ్యులు అంతా హాజరు కావడంతో ఇక్కడే రాజకీయ పరిణామాలకు తెరలేచినట్లయింది. ఇదిలా ఉంటే వైసిపి కౌన్సిలర్లు గైర్హాజరుకు గల కారణాలు ఇంత వరకు సభ్యులు ఎవరు వివరించలేదు. ఒక పత్రిక ప్రకటన విడుదల చేయలేదు. కానీ, వారంతా ముందు రోజే సమావేశమై ఒక నిర్ణయానికి వచ్చి సమావేశానికి గైరాజరైనట్లు తెలుస్తుంది. వైసిపి తరుపున పోటీ చేసి విజయం సాధించి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆశీస్సులతో చైర్మన్‌గా బల్ల గిరిబాబు పదవిని అలంకరించారు. పదవి చేపట్టిన ఏడాది నుంచే ఆయన అంసతృప్తిగా ఉన్నారు.

చైర్మన్‌గా మున్సిపల్ కార్యకలాపాలు, అభివృద్ధి పనులు చేపట్టడం వంటి బాధ్యతలు తాను చేపడుతున్నారు. కొంతమంది మంత్రి అనుచరులు తమ కార్యాలయ కార్యాకలాపాల్లో తలదూర్చి తనకు తెలియకుండానే పనులు చేసుకుపోతున్నారని, దానికి తాను ఇక్కడ చైర్మన్‌గా ఉండడం ఎందుకని ఆయన కొంతకాలంగా మదనపడుతున్నారు. ఇటీవల చోటుచేసుకున్న కొన్ని సంఘటనల కారణంగా ఆరు నెలల కాలం నుంచి చైర్మన్ మంత్రిపై అలకబూని పార్టీ, మంత్రి కార్యక్రమాలకు, చివరకు మంత్రి ఎన్నికల ప్రచారంలోనూ పాల్గొనలేదు. దీంతో మంత్రి అనుచరులే ఆ వార్డులో వైసిపి ఓట్లు చీలకుండా ఉండేందుకు ప్రయత్నాలు చేశారు. మంత్రికి, చైర్మన్ మధ్య సఖ్యత దెబ్బతినడంతో ఆ ప్రభావం పార్టీపైనా, చివరకు ఎన్నికలపైనా పడింది.

వైసిపి సీనియర్ నాయకులు, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్ ఎన్నికల సమయంలో టిడిపిలో చేరి ప్రచారంలో పాల్గొన్నారు. చైర్మన్ తీరు వల్ల ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఎక్కువ వార్డులు టిడిపికే మక్కువ చూపారనే ప్రచారంతో మున్సిపాలిటీ వైసిపి లాస్ అనే సందేశం కూడా బయటకు వెళ్లింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో గురువారం నిర్వహించిన సమావేశానికి వైసిపి కౌన్సిలర్లు హాజరు కాకపోవడంతో మున్సిపాలిటీలోని రాజకీయ పరిణామాలు మరింత చర్చనీయాంశంగా మారాయి. మంత్రితో పాటు వైసిపి కౌన్సిల్ సభ్యులు కూడా చైర్మన్ గిరిబాబుపై గుర్రుగా ఉన్నారు. వైసిపి కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరై చైర్మన్‌పై కత్తిగట్టే ప్రయత్నం చేయడాన్ని కొంత మంది సభ్యులు తప్పు పడుతున్నారు.



కోరం లేక ఖాళీగా ఉన్న కుర్చీలు (ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న గిరిబాబు)



రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి నాగేశ్వర్ రెడ్డి

పోలీస్‌స్టేషన్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం టౌన్ పోలీస్‌స్టేషన్‌ను కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వర్ రెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో కేసుల ప్రగతి, రికార్డులను పరిశీలించారు. జూన్ 4న ఎన్నికల లెక్కింపు సందర్భంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సిఐ టి.ఇమ్మాన్యుయేల్‌రాజు, పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొర

కౌంటింగ్ సిబ్బంది అప్రమత్తం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

జూన్ 4న నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రిటర్నింగ్ అధికారి సుదర్శన్‌దొర ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయంలో ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల కౌంటింగ్ సిబ్బందితో గురువారం సమీక్షించారు. ఇవిఎం, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, స్ట్రాంగ్ రూమ్‌లో బాధ్యతలు గురించి పలు సూచనలు చేశారు. ఏవైనా అలసత్వం వహిస్తే ఎన్నికల నిబంధనలు ప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, విఆర్‌ఒలు, సర్వేయర్లు, మాస్టర్ ట్రైనీలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.



డాన్స్‌లతో అలరిస్తున్న చిన్నారులు

సృజనాత్మకతను వెలికి తీసేందుకే వేసవి వినోదం

శ్రీకాకుళం అర్బన్: వేసవి సెలవుల్లో టివి, సెల్‌ఫోన్లకు అతుక్కుపోయి చదువుకు, మానసిక పరివర్తనకు దూర మవుతున్నారని, అందువలనే వారికి ఆటవిడుపుగా ప్రతిరోజూ వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వేసవి వినోద కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు క్రియేటివ్ చిల్డ్రన్ కన్వీనర్ చింతాడ కృష్ణారావు తెలిపారు. గురువారం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో వేసవి వినోదం కార్యక్రమం కొన సాగింది. ఈ సందర్భంగా పదేళ్లలోపు 75 మంది చిన్నారులు హాజరయ్యారు. వివిధ ఆట పాటలతో పోటీలను నిర్వహించారు. ఏకాగ్రతను పెంచేందుకు దోహదపడే డాన్స్‌పోటీలు నిర్వహించారు. అలాగే వేస్ట్ బెస్ట్ మేనేజ్‌మెంట్ పేరుతో వృధాగా పడి ఉన్న వస్తువుల నుంచి కొత్త అందాలు తెచ్చే వస్తువులను తయారు చేశారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిఐ

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

శాంతి భద్రతలకు విఘాతం కల్పిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని సిఐ వాయునందన్ దివాకర్ యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన వంజంగి, కనుగులవలసలో సిబ్బందితో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో రాజకీయ దురుద్దేశాలతో వివాదాలు సృష్టించే వ్యక్తులపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చిన్నపాటి మనస్పర్ధలను మరచిపోయి ఎప్పటిలాగే అందరూ కలసి మెలిసి ఉండాలన్నారు. కొంతమంది కావాలనే రాజకీయ లబ్ధి కోసం శాంతి భద్రతలకు భంగం కలిగిస్తుంటారని అటువంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. జూన్ ఆరో తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.వెంకటేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అరకొరగా పాఠ్యపుస్తకాలు

టెక్కలి : ప్రభుత్వ పాఠశాలలు తెరిచిన నాటికే విద్యార్థులకు అందివ్వాలనే ఉద్దేశంతో విద్యాశాఖ ఆధ్వర్యాన పంపిణీ అవుతున్న పాఠ్యపుస్తకాలు మండలానికి ఆరకొరగా సరఫరా అయ్యాయి. మండలంలోని 69 ప్రాథమిక పాఠశాలలు, ఏడు ప్రాథమికోన్నత పాఠశాలలు, 13 ఉన్నత పాఠశాలలకు చెందిన 5,175 మంది విద్యార్థులు చదువు తున్నారు. వీరందరికీ వివిధ రకాల సబ్జెక్టులకు 50 వేల పైచిలుకు పాఠ్యపుస్తకాలు అవసరం. ఇప్పటివరకు మెదటి విడతగా 10,638 పాఠ్యపుస్తకాలు సరఫరా అయ్యాయి. ఒకటి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు మాత్రమే పుస్తకాలు సరఫరా కాగా, 8 నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఇంకా పాఠ్యపుస్తకాలు ఒక్కటీ సరఫరా కాలేదు.

వ్యర్థాలతో దుర్గంధం

కోటబొమ్మాళి: మండల కేంద్రంలో గల మాంసం విక్రయ కేంద్రాల నుంచి కోళ్లు, గొర్రెలు, మేకల ఆవశేషాలు, వ్యర్థపదార్థాలు, విందుల నుంచి వస్తున్న ఎంగిలాకులు, మిగిలిన వ్యర్థ పదార్థాలు యథేచ్ఛగా రోడ్డు పక్కనే కుప్పలుగా పోయటం, పక్కనున్న మంగళ గెడ్డ నీరు సైతం కలుషితమై దుర్గంధం వెదజల్లుతుంది. జిల్లా కేంద్రం నుంచి కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, వజ్రపు కొత్తూరు మండలాలకు వెళ్లే అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు వాహనాలపై వెళ్తున్న ప్రయాణీకులు ఇక్కడకు వచ్చినప్పటికీ ముక్కుమూసికోక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఈ వ్యర్థ పదార్థాల కోసం వీధికుక్కలు స్వైర విహారం చేస్తు వాహనాల కిందికి రావటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మాంసం విక్రయ కేంద్రాల నుంచి వస్తున్న వ్యర్థ పదార్థాలను నిరోధించాలని సంబంధిత అధికారులకు ప్రజలు ఎన్నిసార్లు విజ్ఞప్తిలు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ పరిస్థితి స్వయంగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సీతన్నపేట వద్ద రోడ్డు పక్కన కుప్పలుగా పోసిన వ్యర్థ పదార్థాలు

జీవితానికి 'పొగ'

నేడు పొగాకు వ్యతిరేక దినోత్సవం

ప్రజాశక్తి- రణస్థలం

సిగరెట్లు, బీడీలు, చుట్టల రూపంలో పొగతాగడం. పొగాకు ప్రొడక్టులను తినడం ఇప్పుడు చాలా మందికి అలవాటుగా మారింది. వీటి వల్ల కలిగే దుష్ప్రభావాలపై పెద్దఎత్తున ప్రచారం చేస్తూ హెచ్చరిస్తున్నా ఈ అలవాటు నుంచి బయటపడటం లేదు. పొగాకును ఏ రూపంలో తీసుకున్నా అది ఆరోగ్యానికి హానికరమని. ఇది శరీరంలోని అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ధూమపానం, పొగాకు ఉత్పత్తులవలన కలిగే దుష్పరిణా మాలపై ప్రజలకు వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఒ) ఏటా మే 31న 'యాంటీ టొబాకో డే (పొగాకు వ్యతిరేక దినోత్సవం)'ను నిర్వహిస్తోంది. దీన్ని 'ప్రపంచ నో టొబాకో డే'గానూ పిలుస్తారు. పొగాకు వాడకం వలన ఆరోగ్యానికి కలిగే ప్రమాదాలను మే 31న వివిధ కార్యక్రమాల రూపంలో వివరిస్తారు. వరల్డ్ నో టొబాకో డే నిర్వహిం చాలని 1987 ఏప్రిల్ 7న తీర్మానాన్ని డబ్ల్యూహెచ్ఒ ఆమోదించింది. 1988 మే 31 నుంచి ఏటా 'పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని' నిర్వహిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

పొగ తాగడం, పొగాకు సంబంధిత పదార్థాలు నమలడం, మద్యపానం అలవాటుకు దూరంగా ఉండాలి. పొగ తాగుతున్న వారికి దూరంగా ఉండాలి. సిగరెట్ల నుంచి వచ్చే పొగ పీల్చకూడదు. 20 ఏళ్ల నుంచి రోజుకో ప్యాకెట్ సిగరెట్లను తాగుతున్న 40 ఏళ్ల వయసు పైబడిన వారందరూ చెస్ట్ సీటీ స్కానింగ్ తీయించుకోవడం మంచిదని నిపుణులు సూచి స్తున్నారు. 2003లో డబ్ల్యూహెచ్ఒ సదస్సులో జరిగిన అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం 2005 నుంచి అన్ని దేశాల్లోనూ బహిరంగ ప్రదేశాలు, ప్రయాణాలు, పని ప్రదేశాల్లో పొగతాగడాన్ని నిషేధించారు. అలాగే పొగతాగడం వలన కలిగే నష్టాలను సిగరెట్ ప్యాకెట్లపై హెచ్చరిక రూపంలో పెద్దగా బొమ్మలతో ముద్రిస్తున్నారు. పొగాకు ఉత్పత్తుల పై భారీగా పన్ను విధించడం ద్వారా వాటి ధరలు పెంచారు. అయినప్పటికీ పొగ తాగడాన్ని, పొగాకు నమలడాన్ని చాలా మంది మానుకోకుండా ప్రాణాలు పోగొట్టు కుంటున్నారు.

పొగాకు తీసుకోవడం వల్ల కలిగే సమస్యలు

పొగాకులో ఉండే నికొటిన్ అనే పదార్థం ధూమ పానానికి బానిసలుగా మారేలా చేస్తుంది. ధూమ పానం, పొగాకు ఉత్పత్తులను తినడం వలన ఊపిరితిత్తులు, గుండె సంబంధిత జబ్బులు, రకరకాల క్యాన్సర్లు వచ్చే అవకాశాలు ఎక్కువ. పొగ తాగే వారి జీవిత కాలం ఆరోగ్యంగా ఉండేవారితో పోలిస్తే పదేళ్లుతగ్గుతుందనేది ఆరోగ్య నిపుణుల అభిప్రాయం. పొగాకు వలన రక్తనాళాలు సంకోచించి, తాత్కాలికంగా రక్తపోటు పెరిగే ప్రమాదం ఉంది. తక్కువ నికొటిన్ గల సిగరెట్లు, చుట్టలు, బీడీలు కూడా ప్రమాదకరమే అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పొగాకు ఊపిరితిత్తులపై నేరుగా ప్రభావం చూపిస్తుంది. దీని వలన దీర్ఘకాల లంగ్స్ సమస్య సిఒపిడి (క్రానిక్ అబ్జెక్టివ్ పల్మనరీ డిసీజ్)కి దారి తీయొచ్చు. పొగతాగే మగవారి వీర్యం నాణ్యత తగ్గి, శుక్ర కణాల సంఖ్య తగ్గి సంతానంపై ప్రభావం చూపుతుందని పలు పరిశోధనల్లో తేలింది. ధూమపానం చేసే మహిళలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చే అవకాశం ఉంది. అలాగే వారు గర్భం దాల్చాక పిండం ఎదుగు దలపై ధూమపానం ప్రభావం చూపుతుంది. రోగనిరోధక శక్తిని బలహీన పరుస్తుంది.

పొగాకుతో పెరుగుతున్న కేన్సర్ ముప్పు

ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతక వ్యాధుల్లో కేన్సర్ ఒకటి. క్యాన్సర్లలో అనేక రకాలు ఉన్నాయి. వీటిలో ఊపిరితిత్తుల క్యాన్సర్ ఒకటి. 2020లో ప్రపంచవ్యాప్తంగా కోటి 80 లక్షల మంది లంగ్ క్యాన్సర్‌తో చనిపోయినట్టు అంతర్జాతీయ క్యాన్సర్ రీసెర్చ్ ఏజెన్సీ నివేదిక పేర్కొంది. పొగతాగడం, పీల్చడం ఆరోగ్యానికి హానికరమని తెలిసినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో లంగ్ క్యాన్సర్ ముప్పు భారీగా పెరుగుతోందని తెలిపింది.



టెక్కలి : చుట్టలు చుడుతున్న కార్మికుడు

లంగ్ కేన్సర్ లక్షణాలు

చాలామందిలో ఊపిరితిత్తుల క్యాన్సర్ ముదిరాకే లక్షణాలు బయటపడుతున్నాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కఫంలో రక్తం, ఛాతి నొప్పి, దగ్గుతున్నప్పుడు లేదా లోతైన శ్వాస తీసుకుంటున్నప్పుడు గురక, గొంతు బొంగురు పోవటం, స్వరంలో మార్పులు, బరువు కోల్పోవటం, ఆకలి లేకపోవటం, అలసట, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధి తీవ్రత అధికంగా ఉన్నప్పుడు న్యుమో నియా, తరచుగా శ్వాసకోశ ఇన్ఫెక్షన్లకు గురికావటం, పక్క టెముకల వద్ద నొప్పి, మింగడంలో ఇబ్బంది, ముఖం, మెడ లేదా చేతులపై వాపు వంటి లక్షణాలు కనిపిస్తాయి.

పొగ తాగడం, పీల్చడం హానికరం

ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రధాన కారణం పొగతాగడమే. లంగ్ క్యాన్సర్‌కేసుల్లో 85 శాతం పొగ తాగడం వల్ల వచ్చినవే అని డబ్ల్యూహెచ్ఒ పేర్కొంది. ప్రపంచం మొత్తం మీద వంద కోట్ల మందికిపైగా పొగతాగేవారు ఉంటే అమెరికా ప్రాంతంలోనే 12 కోట్ల 70 లక్షల మంది ఉన్నట్టు అంచనా. భారత్ వంటి దేశాల్లోనూ ఈ సంఖ్య ఎక్కువగానే ఉంది. పొగతాగే వారితో పాటు పక్కనుంచి ఆ పొగ పీల్చేవారు కూడా ఊపిరితిత్తుల క్యాన్సర్ ముప్పును ఎదుర్కొంటు న్నట్లు పలు నివేదికలు పేర్కొ న్నాయి. మొత్తం లంగ్ క్యాన్సర్ కేసుల్లో 20 నుంచి 25శాతం దాకా పొగ తాగని వారివే ఉంటున్నట్లు తేలింది. అందుకే ధూమపానం చేసేవారికి దూరంగా ఉండండి.

చుట్టల పరిశ్రమ కనుమరుగు!

టెక్కలి: ప్రపంచ వాణిజ్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో పొగాకు పరిశ్రమ కూడా కుదేలైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చుట్టల పరిశ్రమ పూర్తిగా కనుమరుగు కావడంతో ఆ పరిశ్రమనే నమ్ముకున్న వందలాది కుటుంబాల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుంది. పట్టుశాలి కుల బంధువులకే పరిమితమైన చుట్టల పరిశ్రమ పూర్తిగా కనుమరుగు కావడంతో ఈ వృత్తినే నమ్ముకున్న వారికి మరో వృత్తి అలవాటు కాకపోవడంతో వారు జీవనపరిస్థితి దయా నీయంగా మారుతుంది. ప్రభుత్వం పొగాకు ఉత్పత్తులపై ఆంక్షలు విధించడంతో పాటు, కొన్నిచోట్ల పొగాకు విక్రయాలపై నిషేధం కూడా విధించడంతో క్రమేపీ ఈవృత్తి కనుమరుగైంది. సిగరెట్టు విక్రయాలు జోరందుకున్న తర్వాత చుట్టల వినియోగం తగ్గుముఖం పట్టింది. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో విస్తారంగా చుట్టల అమ్మకాలు, వినియోగం ఉండేది. ఇప్పుడది లేకపోవడంతో చుట్టల పరిశ్రమ, వృత్తిని నమ్ముకున్న వారు ఆర్థిక పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. జిల్లాలో వేలాది మంది కుటుంబాలు ఈ వృత్తినే నమ్ముకుని జీవనం చేస్తుండేవారు. క్రమేపీ చుట్టల పరిశ్రమ నిర్వీర్యం కావడంతో కుటుంబాలు ఛిన్నాభిన్నం అయ్యాయి. పట్టుశాలీ సామాజిక తరగతిని పద్మశాలి కార్పొరేషన్‌లో చేర్చినా, ఎటువంటి రాయితీలు కల్పించకపోవడంతో ఈ వృత్తిదారులు తీవ్ర ఆన్యాయానికి గురయ్యారు. సంఘంలో మిగిలిన కులాలకు ఇచ్చిన రాయితీలు, సంక్షేమం పట్టుశాలీలకు కల్పించక పోవడంతో సంఘం నిర్వాహకులు పలు అగచాట్లుకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వాలు, కార్పొరేషన్లు స్పందించి పట్టుశాలీలను చుట్టల పరిశ్రమ దారులకు ఆదుకోవాలని పలువురు కొరుతున్నారు.



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఇఒ అప్పారావు

పాఠ్య పుస్తకాలు పరిశీలన

ఇచ్ఛాపురం : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన విద్యా కానుక స్టాక్ పాయింట్ వద్దకు 8వ తరగతి పాఠ్యపుస్తకాలు వచ్చాయని ఎంఇఒ అప్పారావు గురువారం తెలిపారు. విద్యార్థులకు సంబంధించి తెలుగు, ఇంగ్లీష్, ఇంగ్లీష్-నాన్ డీటెయిల్, హిందీ, గణితం, ఫిజిక్స్, బయాలజీ, హిస్టరీ జియోగ్రఫీ, పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులకు 11,216 పుస్తకాలు వచ్చాయని అన్నారు.



ఆక్రమించిన కాలువ

కాలువ ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి- పొందూరు

మండలం గోకర్ణపల్లి సమీపంలో నారాయణపురం కాలువను తవ్వి పొలంలో ఆక్రమించు కుంటున్నట్లు గ్రామానికి చెందిన పలువురు నీటిపారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాలువ తవ్వి ఆక్రమణ చేయడంతో వర్షాకాలంలో కాలువకు గండ్లు పడే అవకాశం ఉందని, దానివలన పంటపొలాలు ముంపునకు గురవుతాయని ఫిర్యాదు చేశారు. దీనిపై ఇరిగేషన్ ఎఇ రవికుమార్ ఆధ్వర్యంలో అధికారులు ఆక్రమణకు గురైన కాలువను పరిశీలించారు. రక్షణగా ఏర్పాటు చేసిన రాళ్ల తొలగించి తరలించినట్లు గుర్తించి సంబంధిత రైతులను హెచ్చరించారు. ఈ మేరకు ఆక్రమణపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించ నున్నామని వారి ఆదేశాల మేరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఎఇ తెలిపారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న అభిమానులు

ఘనంగా 'కణితి' జన్మదినం

టెక్కలి : జనసేన పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ జన్మదిన వేడుక గురువారం నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆబిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి తినిపించారు. నియోజకవర్గం పరిధిలోని టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల నుంచి అభిమానులు పార్టీ కార్యాలయానికి చేరుకుని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎన్నికల ఫలితాలపై కొద్దిసేపు చర్చించారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న మురళీధర్

మజ్జిగ పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని విశాఖ బి కాలనీలో శిర్డీసాయి మందిరం వద్ద మారుతీ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్‌సభ్యులు కోరాడ విశ్వనాథం సౌజన్యంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మందిర కమిటీ చైర్మన్ మధుకర్, మారుతీ వాకర్స్ అధ్యక్షుడు కొంక్యాన మురళీధర్ మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని మందిరానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా మజ్జిగ పంపిణీ చేపడుతున్నామని తెలిపారు. కార్యదర్శి రంగారావు, ఆలయ ప్రధానార్చకులు రేజేటి శ్రీనివాసా చార్యులు, కమిటీ సభ్యులు శ్రీదేవి, మారుతీ వాకర్స్ క్లబ్ కార్యదర్శి నాగేశ్వరావు, కోశాధికారి పంచాది నారాయణ మూర్తి, శివున్నాయుడు, శ్రీనివాసరావు, బోయిన విశ్వనాథం, హైమ, నారాయణ్, సత్యం, సత్యవతి పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే మెనూ అమలు చేయాలి



మాట్లాడుతున్న డిఇఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- పొందూరు

ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకే పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు మెనూను అమలు చేయాలని డిఇఒ వెంకటేశ్వర్లు సూచించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎండిఎం నిర్వాహకు లకు గురువారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాఠశాల విద్యార్థులకు అందించాల్సిన పౌష్టికమైన పోషకాహారం తయారీపై ఎండిఎం నిర్వాహకులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగు తుందన్నారు. శిక్షణా కార్యక్రమంలో ఎంఇఒలు పి.వి. రామరాజు, పి. రాజారావు, ఎండిఎం నిర్వాహకులు పాల్గొన్నారు.

పలాస : ప్రభుత్వ పాఠశాలల్లో రుచికరంగా వంటలు వంట చేసి విద్యార్థులకు అందించాలని టెక్కలి డిప్యూటీ డిఇఒ ఆర్.విజయ కుమారి సూచించారు. కాశీబుగ్గ సాయి కాలనీ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 12 నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్నాయని అన్నారు. వంటలు రుచి కరంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. వంటలు తెలియని వారు వంటలు బాగా చేసే వంట వారిని అడిగి తెలుసు కోవాలన్నారు. విద్యార్థులకు పెట్టే భోజనంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా కఠినంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎంఇఒ చెరుకుపల్లి సత్యం, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ పి.బాలరాజు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో వ్యవసాయ రంగం రోజురోజుకు తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోతుందని సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి దంతులూరి వర్మ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని చౌదరి సత్యనారాయణ కాలనీలో ఉన్న సంఘం కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడుతూ వ్యవసాయం గిట్టుబాటు కాక, భూములను తెగ నమ్ముకునే వారు కొందరైతే మరికొందరు ఆ భూములను కౌలుకు ఇచ్చి పట్టణాలకు తరలి వెళ్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మరే ఇతర ఉపాధి అవకాశాలు లేక కూలీ పనులు చేసుకుంటూనే ఆశ చావక భూమిని కౌలుకు తీసుకొని చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలు సాగు చేసుకుంటున్నారని, సాగు సంక్షోభంలో ఉండటంతో వీరంతా తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. వ్యవసాయ కూలీల, పేద రైతుల, గ్రామీణ పేదలందరి జీవనం దుర్భరంగా మారిందన్నారు. ఎన్నికల సందర్భంగా రైతుల జీవితాన్ని మారుస్తామని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చి ఆ తరువాత ఆచరణలో చిన్న, పేద, మధ్యతరగతి రైతాంగం భూముల్ని సాగు చేయకుండా వదిలేస్తున్నా రన్నారు. వ్యవసాయాన్ని కంపెనీ, కార్పొరేట్ వ్యవసాయంగా మార్చి రైతులకు తీవ్రమైన నష్టాన్ని చేకూరుస్తున్నారన్నారు. ఇటువంటి తరుణంలో జూన్ 15, 16, 17 తేదీల్లో ఏలూరులో రైతుకూలీ సంఘం రాష్ట్ర మహాసభలు నిర్వహి స్తున్నట్టు తెలిపారు. రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షులు పి.పోలారావు, జిల్లా కార్యదర్శి తాండ్ర అరుణ, సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, కృష్ణారావు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణా శిబిరాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పుస్తకాలు చదవడం అలవర్చుకున్న వారికి అవి చిరకాలం స్నేహితునిగా వెంట వస్తాయని, అందువలన విజ్ఞానం పెరుగుతుందని రిసోర్స్‌పర్సన్ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. రిసోర్స్‌పర్సన్‌గా శ్రీనివాసరావు వివిధ పుస్తకాలు, వాటి రచయితలు, వాటిలో దాగి ఉన్న అంశాలపై అవగాహన కల్పించారు. ఈశ్వర్ ఆర్ట్స్ అండ్ డిజిటల్ సంస్థ ప్రతినిధి ఈశ్వరరావు విద్యార్థులకు గణితం, చిత్ర లేఖనంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో 50 మంది విద్యార్థులతో పాటు జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్ రాజా, డిప్యూటీ లైబ్రేరియన్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి.భాస్కర రాజా పాల్గొన్నారు.

లావేరు : ప్రతి విద్యార్థి సహజ యోగ ధ్యానం చేయాలని రిసోర్స్‌పర్సన్ మురపాక లక్ష్మీ ప్రసన్న అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో సహజ యోగా ధ్యానంపై విద్యార్థులకు ప్రయోగాత్మకంగా తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నం: స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించిన



లావేరు : యోగాపై విద్యార్థులకు వివరిస్తున్న లక్ష్మి

వేసవి విజ్ఞాన శిబిరంలో చిన్నపిల్లల వైద్యులు, సిహెచ్‌సి సూపరింటెండెంట్ జి. వేణుగోపాల్, విశ్రాంత మండల అభివృద్ధి అధికారి ఎస్.చిరంజీవి, న్యాయవాది ఎం. రామారావులు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. చిన్నతనం నుంచే గ్రంథాలయాలపై ఆసక్తి పెంచు కోవాలన్నారు. అవసరమైన పుస్తకాలతో స్నేహం చేసి వారి జీవితాలు సరిదిద్దుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కాళ్ల రాజు, రిసోర్స్ పర్సన్స్ పెద్దింటి ఆనందరావు, బి.బెనర్జీ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక శాఖాగ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా గణితంపై బోధించారు. విజేతలకు జూన్ 6న బహుమతులు అందజేస్తామని గ్రంథాలయాధికారి ఆర్.అనురాధ తెలిపారు.

నిప్పులు చెరుగుతున్న ఎండ

భగభగమంటున్న భానుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జిల్లాలో ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగాయి. కొద్ది రోజుల నుంచి సూర్యుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. ఉదయం 10 గంటల నుంచే వడగాడ్పులు వీస్తున్నాయి. రాత్రి పూటా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావడంతో వేడి తగ్గడంలేదు. నైరుతి రుతుపవనాలొస్తే వాతావరణం చల్లబడుతుందని ఆశిస్తున్న తరుమంలో ఆకస్మాత్తుగా ఉష్ణోగ్రతలు, వడ గాడ్పులు పెరగడం జిల్లావాసులను ముఖ్యంగా కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలకు చెందిన ప్రజలకు భయకంపితులను చేస్తోంది. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవు తున్నాయి. సముద్రం పైనుంచొచ్చే గాలులు వేడిగా ఉంటున్నాయి.

నిర్మానుష్యంగా ప్రధాన రోడ్డు



నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

పాతపట్నం: ఎండ తీవ్రతకు ప్రజలు 10 గంటలు దాటిన తర్వాత బయటకు రావడానికి భయపడుతున్నారు. పాతపట్నం మెయిన్ రోడ్డు గురువారం ఉదయం 10 గంటకే ఖాళీ దర్శినమించింది. అగ్నిగుండంగా మారిన ఎండ తీవ్రతకు ఎన్నడూ లేనివిధంగా ఎండలు ఉష్ణోగ్రతలు పెరిగి మండుతున్నాయి. దీంతో ఎసిలకు, కూలర్లకు రిమాండ్ పెరిగింది. దీంతో రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం పెరిగింది. సాయంత్రం 6 గంటల వరకు బయటకు రాని పరిస్థితి

కందిరీగల దాడిలో వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు



మాకమ్మ (ఫైల్)

మండలంలోని పల్లి సారథికి చెందిన బత్తిన మాకమ్మ (75) కందిరీగల దాడిలో మతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంగళవారం సాయంత్రం గ్రామానికి సమీపంలోని తన తోట నుంచి ఇంటికి వస్తుంది. ఈ క్రమంలో దారిలో కందిరీగల పట్టు రేగి ఉంది. అటుగా వస్తున్న వృద్ధురాలపై ఒక్కసారిగా కందిరీగలు దాడి చేశాయి. స్థానికంగా వైద్య సేవలు అందించి మెరుగైన వైద్యం కోసం కాశీబుగ్గలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలికి కుమార్తె ఉన్నారు. ఆమెకు వివాహం కావడంతో ఒంటరిగా జీవనం సాగించేంది. కందిరీగల పట్టులు ఈ ప్రాంతంలో అధికంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. కందిరీగల దాడి ప్రాణా పాయమని, అప్రమత్తంగా ఉండాలని స్థానికులు కోరారు.




బెల్లంఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

బెల్లంఊటలు ధ్వంసం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని మామిడిగుడ్డిలో టెక్కలి సెబీ ఎన్‌ఫోర్స్‌మెంట్, పలాస డిటిఎఫ్ సిబ్బంది సారా తయారీ స్థావరాలపై గురువారం దాడులు నిర్వహిం చారు. ఈ దాడుల్లో వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 40 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నాటుసారా తయారీ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ... అవగాహన కల్పించారు. సెబీ సిఐ జి.రాజశేఖర్ నాయుడు, డిటిఎఫ్ సిఐ పి.రామచంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

పాతపట్నంలో కార్డాన్‌సెర్చ్

ప్రజాశక్తి- పాతపట్నం

మండలంలోని స్థానిక శివశంకర్ కాలనీలో పాతపట్నం, మెళియాపుట్టి ఎస్ఐలు మహమ్మద్ యాసిన్, రాజేష్‌ల ఆధ్వర్యాన గురువారం కార్డాన్‌సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిం చారు. వాహనా పత్రాలను పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల ఫలితాలు వచ్చే రోజున బాణసంచా కాల్చరాదని, ఎన్నికల సంఘం ఆదేశాలను కాదని ఎవరైనా చట్టవ్యతిరేకంగా ప్రవర్తిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు మెళియాపుట్టి మండల సమావేశం

మెళియాపుట్టి : ఈ నెల 31న మెళియాపుట్టి మండల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ జి.భాస్కరరావు ప్రకటనలో తెలిపారు. ఎన్ఆర్ఇజిఎస్ కార్యాలయంలో ఎంపిపి రాణా ఈశ్వరమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నామని అన్నారు. విధిగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పూర్తి సమాచారంతో మండలస్థాయి అధికారులు పాల్గొవాలని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

రణస్థలం 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్టు కొమ్మల తొలగింపులో భాగంగా ఈ నెల 31న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఇఇ ఎస్.బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జె.ఆర్.పురం, రణస్థలం, రావాడ, కొండములగాం, బంటుపల్లి, సంచాం, కమ్మ సిగడాం, అర్జునవలస తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివే స్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.